

ఇది నాది అనే గుణం యథార్థమయినది. ఈ నాది అనే ప్రవృత్తే వ్యక్తియొక్క అన్ని రకాల విక్రియలకు మూలం: దాన్ని ఆస్కారం చేసుకుని నేడు అన్ని రకాల ప్రబోధాలూ సాగుతున్నాయి. ఈ నాది అనేదాన్ని కార్యకారణ దృష్టితో తర్కించుకోగల తాహతును సామాన్య విద్యాసంస్కారాలు గల పౌరునికి కలుగచేయవలసిన బాధ్యత ఎంతయినా ఉన్నది. ఆ పనిని రాజ్యాంగయంత్రం చేస్తే మంచిదే, చేయడం లేదన్న కోపంతో చేతులు నలుపుకుంటూ కూర్చుంటూ వ్యక్తి తన "నా" కోసం పాటుపడుతున్నానని అనుకుంటూ, తననే నాశనం చేసుకుంటున్నాడు.

... ...

వెంకయ్యకాపు తన చేలన్నీ గిరగిరా తిరిగి ప్రొద్దు క్రుంకేసరికి వచ్చాడు. వీడులోకి వచ్చేసరికి వాన వాసన తగిలింది. పెద్ద జువ్విచెట్టుకింద నుంచుని ఏటివంక పరకాయించి చూశాడు. ఏరు చాలా కొద్దిసేపట్లో పొంగనున్నదని తెలుసుకున్నాడు. మునుపు ఓసారి ఇట్లాగే ఏరు చాలా ఎక్కువగా పొంగింది. అప్పుడు తను నడి వయస్సులో ఉన్నాడు. పైరుతో ఉన్న చేలన్నీ పాడైపోయినా తన శరీరంలోని బలాన్ని చూసుకుని చాలా ధైర్యంగా ఉన్నాడు. అప్పటికి తన కూతురు ప్రసవమయి ఇరవై రోజులు. ఆపసిగుడ్డునూ బాలింతనూ తన పిల్లలను నలుగుర్నీ ఏ ప్రమాదమూ రాకుండా ఆనాడు కాపాడుకోగలిగాడు. ఈ సారి క్రొత్త పొంగితే సంగతులు ఎట్లా ఉంటాయో తన ఊహ కందడం లేదు.

తన నలుగురు కొడుకులూ పెద్దవాళ్ళయినారు. ఆడపిల్లలు అత్తవారింటికి వెళ్ళారు. తన కున్న పొలమూ గట్రా కొడుకులే చూసుకుంటున్నారు. అసలు వాళ్ళు చూసుకోవడమే తన కోరిక. అయినా రోజు కోసారయినా పొలాలన్నీ చూసివస్తేనేగాని తనకు తృప్తి ఉండదు.

జువ్విచెట్టు క్రిందనే ఓ పెద్ద బండ ఉన్నది. ఆ బండదగ్గర గొడ్లు కాచుకునే పిల్లలు ఆడుకుంటారు. వెంకయ్యకాపు కాసేపు అటూయిటూ చూసి ఆ బండమీద చతికిలబడ్డాడు. తన పెద్ద కొడుకు గ్రామమున్సిఫ్ సంపాయించాడు. తన చిన్నకొడుకు స్కూలు ఫయినలుదాకా చదివి ఊళ్ళోనే ఉండి పొలంపని చూసుకుంటున్నాడు. మూడోవాడూ నాలుగోవాడూ అయిదోక్లాసుదాకా చదివి అంతతో చదువు మానుకుని పొలం పని చూసుకుంటున్నారు. నాలుగోవాడు కొంచెం కొరకొరలాడే స్వభావం కలవాడు. పెద్దవాడు ఎప్పుడూ తన గౌరవ ప్రతిపత్తుల సంగతే తప్ప సమష్టికి సంబంధించిన సంగతులే పట్టించుకోవడంలేదు. ఆ సంగతి నాలుగోవాడికి గిట్టకనే భాగాల పంపకం తెచ్చాడు.

ఇది యిప్పటికి ఆరేండ్లనాటి సంగతి. కొడుకు "అయ్యా, ఎవళ్ళకుండ వాళ్ళం పెట్టుకుంటాం" అని అన్నప్పుడు వెంకయ్య తన పొడుగు మీసం పైకి తీసుకుని ఓ చిరునవ్వు నవ్వుతూ, "అట్లాగే" అన్నాడు. నాలుగోవాడికి వెంకయ్యకాపు కూడా భాగం తీసుకోవాలని ఉన్నది. వెంకయ్యకాపు ససేమిరా అన్నాడు. ఆఖరికి అయ్యను

తనతో పాటు ఉండమన్నాడు. వెంకయ్యకాపు అదీ వీల్లేదన్నాడు.

తను ఆ ఊరు మొదట వచ్చినపుడు ఓ చిన్న గుడిసె వేసుకున్నాడు. కొంచెం కొంచెం మార్పులతో అదే ఈనాటికీ నిలిచివున్నది. దాంట్లోనే ఉంటానన్నాడు. ఎవరికి తోచిన గంజలు వాళ్లనే తెచ్చి యిమ్మన్నాడు. తనకు గంజులు పుట్టకపోతే ఇంట్లో రెండిమాని ఏకొడుకు ఇంటికో పోయితింటాడు. అప్పుడు తనమడిసి లచ్చి ఏమీ అనేదికాదు. ఇప్పుడు అదీ లేదు. ఇహా తనకేం దిగులు? ఆ బండమీదనే కూర్చుని అన్నీ గుర్తుకు తెచ్చుకుంటున్నాడు. అవన్నీ ఎందుకు గుర్తుకు వస్తున్నాయో తెలియక వెంకయ్యకాపు తికమకపడ్డాడు.

లేచినుంచుని మళ్లీ ఓసారి ఏరువంక పరకాయించి చూచాడు. అప్పటికే ఏరు లంకలో ప్రవేశించడానికి సిద్ధంగా ఉన్నది. ఈ యేటికి తనమీద ఎందుకింత కోపమో తన కర్థం కావటము లేదు. అవునుగాని ఈ గవర్నమెంటువాళ్లు పోనీ ఏరు ఊళ్లోకి రాకుండా ఏమన్నా చెయ్యరాదూ? అది వాళ్లకసలే పట్టదు. వెంకయ్య కాపు గబగబా నడచి తన గుడిసె ముందుకు వెళ్లి నిలబడ్డాడు. కోడెదూడ గుంజకు కట్టిన తాడు తెంచుకొని వచ్చి కిందుకు తొక్కుతూ వచ్చి కాపుముందర నిలబడింది. కాపు దాని గంగడోలు తన చేతితో నిమురుతూ "ఏం...ఎందుకూ ... ఇంత కోపం ... తాడు తెంచావేం ..కొత్తతాడు ... ఆ... అదా... నిన్న అమ్మతానని వెంకయ్య చిన్న అన్నాడు. అది నీకు తెలిసిందా ?... నేను అమ్మనుగా... వెధవ వెయ్యి రూపాయలు ఎవరికి కావాలి! పదా..." అంటూ దాన్ని మరో పలుపుతో ఇంకో గుంజకు కట్టివేశాడు. ఒక జనుపకట్టె, కాస్తకొన్నదంటూ,, కలిపి దానిముందర వేశాడు. అదిబుసబుసలాడుతునే జనుపకట్టెనములుతోంది.

సమష్టి కుటుంబంలో ఉండగా వెంకయ్య కాపుకి నాలుగు ఆవులుండేవి. అందులో పెద్దావు తాను మొదట కొన్నది. దాని దూడే యిది. ఇది పెద్దకొడుకు భాగంలోది. కాని వాళ్లకెవరికీ లొంగదు. అందుకని వాళ్లు వెంకయ్యకాపు దగ్గరే దాన్ని ఉంచి దాని సంగతి చూస్తుండమన్నారు.

పెద్ద కొడుకు నిన్న దాన్ని ఎవరికో వెయ్యి రూపాయల కమ్ముతున్నానని బేరం తీసుకు వచ్చాడు. వెంకయ్యకాపు "వెయ్యి రూపాయలకు ఎవరయినా తన కొడుకుని అమ్ముకుంటారా?" అని అడ్డం తగిలాడు. కొడుక్కి అమ్మాలని గట్టిగా ఉన్నది. అయినా తండ్రి అడ్డం తగిలేసరికి అయన్ను కాదని అమ్మే సాహసం లేకపోయింది.

ఆ దూడ ఒక ఎత్తూ మిగతా తన ఆస్తి అంతా ఒక ఎత్తూ వెంకయ్య కాపుకి. ఏరు అంతగా పొంగి వస్తోందని తెలిసినవాళ్లు సామాన్లూ అదీ జాగ్రత్త పరచుకుంటున్నారు.

గ్రామ మున్సబయిన వెంకయ్య పెద్దకొడుకు యింటికి ఓవర్సీర్ వచ్చి ఏరు చాలా ప్రమాదకరంగా ఉన్నదన్న సువార్త అందించాడు. పైగా దగ్గరనున్న లాకుల దగ్గరికిపోయి ఆయన కొన్ని బోట్లుకూడా తెచ్చాడు. కాని సగం రాత్రి లంకలోని వాళ్లెవరూ లంకను వదలి పొరుగు గ్రామాలకి పోవడానికి తెమలలేదు. కాని తొలి కోడి కూసేవేళకు లంకలోని కొన్ని ఇండ్లు మునగ సిద్ధంగా ఉన్నాయి. తప్పక చాలామంది తమ సామాన్లు వేసుకొని లంకనుండి బయలుదేరి అటు ప్రక్క వూరుకో ఇటు చావుకో వెళ్లిపోయారు. మనుషులు తమ ప్రాణాలు రక్షించుకునే హడావుడిలో ఉంటే చాలా పశువులు ప్రవాహంలో కొట్టుకుపోయాయి. ఈతవచ్చిన ఎడ్లూ గిత్తలూ ప్రవాహంలో కొట్టుకుపోతూనే ఏదో ఒక గట్టుకి చేరుతున్నాయి. ఈతవచ్చికూడా వాలు తెలియని పశువులు అట్లాఅట్లా గిరగిరా తిరుగుతున్నాయి.

వెంకయ్యకాపు దగ్గరకి మునసబు వచ్చాడు. అప్పటికి తెల్లవారవస్తోంది. దాదాపు లంక అంతా మునిగిపోయినట్టే.

"అట్లా చూస్తావేం. పదా, ఆ నావలో ఎక్కు" అన్నాడు మున్సబు. వెంకయ్యకాపు వినిపించుకున్నాడో లేదో తెలియదు.

"ఏందే అట్లా చూస్తావు" అని మునసబు గదమాయించాడు. "ఆ...ఏం లేదు. అమ్మాయిలూ, కోడలూ, అందరినీ అవతలికి చేరేశావా!"

"అందర్నీ చేరేశాగాని నువ్వు కదలవేం! ఆ దూడను ఆడ వదులు."

"అ...అట్లనే వదులుతాను. నువ్వు పదా" అన్నాడు వెంకయ్య కాపు ముఖం చిట్లిస్తూ.

మున్సబుకు ఒకటనా! అంతేక ఎటో పడి పోయాడు. వెంకయ్య కాపు తన చెమటూడ్చి కట్టిన గుడిసె పడిపోవడం చూశాడు. తనది అనేది ఈ విధంగా నాశన మయిపోతుంటే చూస్తూ సహించడం అతని అలవాట్లలో లేదు. కాని చేసేదీ ఏమీ కనుపించలేదు.

రెండోకొడుకూ, మూడోకొడుకూ ఊళ్ళో లేరు. వాళ్ళ పిల్లాజెల్లలనూ, మూట దసకాలనీ నాలుగోకొడుకు అవతలకి చేరవేశాడు. తీరా నిలదొక్కుకొని చూసే సరికి తన నాయన ఇంకా లంకలోనే దూడను కావలించుకుని కూర్చున్నాడన్న సంగతి గుర్తుకొచ్చింది. జరిగిన దానికి చాలా బాధపడ్డాడు. తన తండ్రి యీద లేదని కాదు. ఆయన గజ ఈతగాడు. బెజవాడ దగ్గిర క్రిష్ణ నిండా వచ్చినప్పుడు అటునుంచి ఇటూ ఇటునుంచి అటూ నాలుగుసార్లు ఈదిన ఆరడుగుల మనిషి. అయినా అతనికి ఎందుకో భయంగానే ఉన్నది.

గబగబా కట్టదగ్గరకు వచ్చి చూసేసరికి ఏటి మధ్యన ఒక చిన్న నావ కనుపించింది. అందులో తన తండ్రి ఉన్నాడేమో నని ఆశపడ్డాడు. కాని ఆ పడవ సరిగ్గా ఏటి మధ్యకి వచ్చే సరికి ఓ పెద్ద తుమ్మచెట్టు కొట్టుకు వస్తూ వస్తూ దానికి అడ్డంపడ్డది. ఇంకా ఏముంది అసలే చిన్న పడవ అందులో దాంట్లో ముప్పయిమంది మనుషులూ, కొంత సామాను. నిలువుగా పడవమునిగింది. అది చూస్తున్న వెంకయ్య నాలుగో కొడుకు శివ శివా అంటూ ఏటిలోదూకి లంకవైపు ఈదడం మొదలు పెట్టాడు. ఈతలో తండ్రికిఎంతమాత్రంతీసిపోడు.

కాస్తదూరం యీదేసరికి వాడికి ఓ పెద్ద కాటి చెట్టుఅడ్డంతగిలింది. దాని నిండా అన్నీ పాములే. తెగ బుసకొడుతున్నాయి. తాడితప్పించుకుని ఎట్లాగో అవతలపడేసరికి ఎక్కడినుంచి వచ్చిందో ఆ పాము మొసలి అది వాణ్ణిలాక్కుపోయింది.

అవతలిగట్టున నిలబడ్డ వెంకయ్యకాపు దూడ సంగతి ఆదమరచాము. అసలే భయానకంగా ఉన్నది. ఒకరిసంగతి ఒకరు పట్టించుకునేస్థితి వలను దప్పింది. ప్రాణాలు గుప్పిటలో పట్టుకుని ఎవళ్ళ గొడవలో వాళ్ళున్నారు.

వెంకయ్యకాపుకీ గొడవంతా కొంత ఆశ్చర్యంగానూ మరికొంత భయంగానూ ఉంది. ఈ ఏరు ఇట్లా పొంగాలిసిందేనా? ఈ విధంగా జనం అంతా అనర్థకపుచావు చావాలిసిందేనా! ఈ ఏటినిగురించేనా తను ఊళ్లోని పంతులు తియ్యని పాటలు పాడుతాడు! ఏ కోశానా దయ అనేది కనుపించకపోతే యీ మనుషులంతా ఏమయిపోతారు! తనకు దయ ఉన్నది. వీళ్ళందర్నీ ఈ ఆపద నుండి కాపాడాలని ఉన్నది. తనేం చేయగలడు?

ఇట్లా ఆలోచిస్తూనే నిలబడ్డాడు. దూడ చెంగు చెంగున పరుగెత్తుకుని వచ్చి అతని పై పంచ లాగుతోంది. అయోమయపు ఆలోచనలలో మునిగి తేలకుండా ఉన్న వెంకయ్యకాపుని నిద్రలేపినట్టు లేపింది. దూడపలుపుకు పట్టుకుని గబగబా అప్పుడేబయలుదేరనున్న నావదగ్గరికి వెళ్లాడు.

"నువ్వయితే ఎక్కు. ఆ దూడకు చోటు లేదు." అని జనం అరిచారు.

"దూడకు చోటు లేదా! అయితే నేనూ ఎక్కను" అన్నాడు వెంకయ్యకాపు. నావ కదిలిపోయింది.

వెంకయ్యకాపూ కోడిదూడా ఏటిలో ఈద మొదలు పెట్టారు. దూడ చాలా బలం గలది. దాన్ని వదిలివేస్తే అది గట్టుకు చేరగలదు. వెంకయ్యకాపు గజ యీతగాడు. దూడను వదిలితే కొంచెం ప్రయాసపడి అయినా అవతలి గట్టుకు హాయిగా చేరగలడు. కాని దూడ కాపును వదలలేదు. వదలదు. కాపు దూడ నంతకన్నా వదలలేడు.

ఏటి మధ్యకి వచ్చేసరికి పెద్ద తెప్పగా నీళ్ళు వచ్చినయి. వెంకయ్యకాపు పట్టువదలకొద్దీ యీదుతున్నాడు. దూడ వెనకపడ్డది. దాని పలుపును తన మొలతాటికి కట్టుకున్నాడు. ఓ పెద్దగాలి ఆరంభమయింది. దాంతోపాటు ఏరు పొరవడి జాస్తయింది. అయినా వెంకయ్యకాపు ఈదుతునే ఉన్నాడు.

అంతలో రెండుమూడు తుమ్మచెట్లు ఒకటిగా కొట్టుకు వచ్చినయి. వెంకయ్యకాపూ ఆయన దూడా వాటితో కొట్టుకుని పోయినారు. అక్కడ మునగడం ఎక్కడ తేలారో తెలియదు. అసలు తేలారో లేదో!